కథ

# గడ్డిపరక

## చొప్పదండి సుధాకర్

మూడంతస్థుల కొత్త కాలేజీ భవనం!

ఆఖరు అంతస్థులోని అసెంబ్లీ హాల్లో సమావేశంలాంటి శిక్షణా కార్యక్రమం. వేదికపై నలుగురు వక్తలు. అందులో మిగతా ముగ్గుర్ని డామినేట్ చేస్తూ ఒక ముఖ్యవక్త... పేరు భుజంగం... వేదిక 'మీ కోసం' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు శిక్షణా శిబిరం.

శిక్షకులు దాదాపు పాతికమంది యువరైతులు... సమయం మిట్ట మధ్యాహ్నానికి కొంచెం ముందు...! ముఖ్యవక్త భుజంగం ప్రసంగం ప్రవాహంలా సాగిపోతూనే ఉంది! "కాబట్టి రైతుమిత్రులారా-! నే చొప్పబోయే విషయం వినడానికి కొంత కటువుగా ఉన్నా ఇది అక్షరాలా నిజం! రానున్న కొద్దిరోజుల్లో, వద్దన్నా కట్టెదుట నిలబడబోయే కఠోరసత్యం! అందుకని ఒక్కసారి- మనసుపెట్టి ఆలోచించండి. ఇది నిజం...పదేపదే చెప్పాల్సిన అవసరం ఉంటుందనుకోను! మీరు వాస్తవానికి మాకన్నా తెలివయినవారు. కానీ- విషయమేమిటో తెలియక అమాయకంగా, ఒక ఫిక్స్‌డ్ మైండ్‌తో, సంప్రదాయబద్ధంగా ఆలోచిస్తున్నారు- అంతే-! ఒక రకంగా చెప్పాలంటే ఈ విషయంలో మీ తప్పూ లేదు మూసధోరణిలో వెళ్ళడం మనకందరకు అలవాటు- ఇందుకు మన నిత్య జీవితంలోని ఎన్నో ఉదాహరణలు ఎత్తిచూపవచ్చు. కానీ అంతకన్నా ముందుగా అసలు విషయం చెప్పి ముగిస్తాను. అది విన్న తర్వాత మీకేమయినా అనుమానాలుంటే నిస్సంకోచంగా అడగవచ్చు. వాటిని మా శక్తిమేర నివృత్తి చేస్తాం..." భుజంగం ఊపిరి తీసుకోవడానికన్నట్టు కాసేపాగి ఎదురుగా టేబుల్‌పై ఉన్న వాటర్ బాటిల్ ఓపెన్ చేసి సగం తాగి మళ్ళీ యథాస్థానంలో ఉంచాడు.

శిక్షణా కార్యక్రమం ప్రారంభంలోనే నిర్వాహకులు సప్లయ్ చేసిన ఖరీదైన బిస్కట్లు జీవితంలో మొదటిసారి రుచి చూస్తూ-మధ్య మధ్య వేడి వేడి కాఫీ చప్పరిస్తూ మల్లయ్య ఆలోచనలో పడిపోయాడు.

'మీ కోసం' స్వచ్ఛంద సంస్థపేరూ- జిల్లా వ్యాప్తంగా అది చేపట్టే సేవా కార్యక్రమాల తీరూ- జోరూఆ నోటా, ఈ నోటా వినడమేగానీ అవింత గొప్పగా పకడ్బందీగా ఉంటాయని అతడెప్పుడూ ఊహించి ఉండలేదు. మొట్టమొదటిసారి అది నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటున్న మల్లయ్యకు సదరు సంస్థ ప్రతి కదలికలో తీసుకొనే జాగ్రత్తలు చూస్తుంటే దానిపట్ల అదీ ఇదీ అని చెప్పలేని భక్తి భావమేదో అప్పటికప్పుడే మొలకెత్తింది.

"ఇంతకు చెప్పాలనుకొన్న మేటరేంటో" సన్నగా గొణిగినా ప్రశ్న సూటిగానే వచ్చింది.

మల్లయ్య తలతిప్పి చూశాడు. ఎవరో నడీడువ్యక్తి ఒకరు స్థిరంగా కూచుని వేదికవైపే చూస్తూ ఉన్నాడు. ప్రశ్న సంధించింది. అతడే-!


తనకు లేని ధైర్యం ఆ వ్యక్తికి పుష్కలంగా ఉన్నందుకు మనసులోనే అతడిని అభినందించాడు. ప్రశ్నను ఆహ్వానిస్తున్నట్టు ఇందాకటి వక్త అదే- భుజంగం లేచి మైకు సర్దుకొన్నాడు.

"గుడ్- మంచి ప్రశ్న... నేనూ అదే చెప్పబోతున్నాను" చిన్నగా నవ్వి అన్నాడు. ప్రతిగా అంతా ఊపిరి బిగబట్టారు. ఎందుకంటే అంతకు ముందతడు చెప్పిన విషయం తాలూకు సీరియస్‌నెస్ నుండి వాళ్ళింకా తేరుకోలేదు.

"ఇక ఉపోద్ఘాతాలు- శరాఘాతాలు అన్నీ కట్టిపెట్టి సూటిగా విషయంలోకి వస్తాను. ఏతావాతా మేం చెప్పబోయేదేమిటంటే... మనమంతా ఇన్నాళ్ళూ- చాలా తేలిగ్గా చూసీ చూడనట్టు వదిలేస్తూ వస్తున్న- మన పరిసరాల్లో పెరిగే గడ్డి- నిజానికి మానవజాతి మనుగడకే ప్రమాదంగా మారనుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది గడ్డి కాదు- విషం...!! మనకి మనమే చేజేతులా పెంచి పోషిస్తోన్న కాలసర్పం..." టేబుల్‌పై అంతకుముందే సిద్ధం చేసిపెట్టుకొన్న గుప్పెడు పచ్చిగరికను చేతితో ఎత్తి చూపించాడు.

అక్కడున్న పాతికమంది రైతుల్లో ఒక్కరు కూడా మినహాయించకుండా అందరూ అదిరిపడ్డారు! మల్లయ్య అయితే ఊపిరి తీసుకోవడమే మరిచిపోయాడు.

"నాకు తెల్సు మీరంతా ఇటువంటి షాక్‌కి గురవుతారనీ...! అందుకే మిమ్మల్ని ఇంతసేపు మాటలతో సగం సంసిద్ధులను చేశాను" వక్త నాప్‌కిన్‌తో మూతి తుడుచుకొని ఎడంచేత్తో కాఫీగ్లాసు అందుకొని అన్నాడు.



మల్లయ్య ఆ మనిషి చేతిలో గరికను మళ్ళీ పరికించి చూశాడు.

సందేహం లేదు! అదే గడ్డి...

పొలాలగట్ల మీద... కొండల మీద... మైదానాల్లో ఎక్కడబడితే అక్కడ కరువనకా... కాలమనకా అడ్డదిడ్డంగా పెరిగే గడ్డి... ఆవులు, బర్రెలు... మేకలూ ఆబగా... ఆప్యాయంగా తినే గడ్డి... పచ్చిగడ్డి...!!

"దీన్ని మనమంతా పచ్చిగడ్డి- లేదా గరిక అంటుంటాం. ప్రపంచంలో ఇది లేని చోటు లేదు. పట్నాల్లో, పల్లెల్లో, పొలాల్లో, జిల్లాల్లో మీరెక్కడ నిలబడి చూసినా చుట్టూ గజం దూరంలో కనిపించే మొక్క జాతి... నిజానికి గడ్డిజాతుల్లో దాదాపు యాభయిదాకా ఉన్నా ఈ జాతి- ప్రత్యేకించి మన దేశంలో పెరిగే జాతి. మహా గడుసుది- అదెట్లాగో

తర్వాత చెబుతాను. పోతే ఈ గడ్డిని పశువులు ఇష్టంగా తింటూ... మనకు పాలిస్తుంటాయి. వాటిని మనం అత్యంత ప్రియంగా బొట్టు మిగల్చకుండా తాగడంతో బాటు మన పిల్లలకు కూడా బలవంతంగా తాగిస్తుంటాం. ఇదంతా మీకందరికి తెల్సిన విషయమే అయినా తెలియని విషయమేమిటంటే ఈ గడ్డిద్వారా విషం అతి సూక్ష్మంగా పశువుల్లోకి చేరి వాటి శరీరంలో మరింత ప్రమాదకరంగా పులిసి సదరు అవశేషాలతో పాలద్వారా బయటకు వస్తాయి. ఆ పాలు మనం తాగినపుడు అవి మన జీర్ణాశయంలో చేరి అక్కడ గుడ్లు పెడతాయి. ఆ గుడ్లు వారం రోజుల్లో పగిలి- అక్కడే- అంటే అదే జీర్ణాశయం గోడలకు అంటుకొని మూత్రపిండాలు, కాలేయం వంటి అతిముఖ్యమైన శరీర భాగాలను ఇన్‌ఫెక్షన్‌కి గురిచేస్తాయి. దీంతో చక్రం పూర్తవుతుంది. ఇలా జరిగినపుడు అంతిమంగా మొత్తం తరం... ఇప్పుడు కాకపోవచ్చుగానీ త్వరలోనే మొత్తం తరమే నాశనమయిపోతుంది- ఈ విషయాలన్నీ ఒక క్రమపద్ధతిలో అరటిపండు వొలచిపెట్టినంత చక్కగా వివరించి చెప్పడానికి మన దగ్గర సరిపడ సాహిత్యం ఉంది. ఈ మూడు రోజుల ట్రైనింగ్‌లో వాటిని బోధించడానికి తగు నిష్ణాతులను కూడా ఎంపిక చేశాం. ప్రస్తుతానికి సమయం మించిపోతోంది భోజనాలకు వెళదాం... పక్కహాల్లో అన్ని సిద్ధంగా ఉన్నాయి. వెళ్ళండి, వెళ్ళి కడుపునిండా తిన్నాక కాసింత విశ్రాంతి తీసుకొని రెండో సెషన్ మొదలెడదాం- దయచేసి రెండోపూట ఎవరూ మిస్ కావొద్దు. ఊళ్లో పనుందనో, సినిమా చూసొద్దామనో- ఇంకోటనో 'గయాబ్' కావొద్దు".

అనుకోకుండా పేలిన చిన్నపాటి జోక్‌కి అంతా నవ్వారు. అయిదారు సెకన్ల విరామం తర్వాత వక్త మళ్ళీ అందుకొన్నాడు.

"నాకు తెల్సు... మీరంతా ఎంతో శ్రద్ధగా- సీరియస్‌గా కొత్త విషయాలు నేర్చుకోవడానికే ఇంతదూరం వచ్చారనీ- కానీ మా భయం మాకుంటుందిగా, అందుకే ట్రైనింగ్‌ని టౌన్‌కి దూరంగా ఏర్పాటు చేశాం. మీకు ఇంకో విషయం కూడా తెలియజేయాల్సి ఉంది, అదేమిటంటే టీ, కాఫీ- వక్కపొడులతోబాటు ఇంకా ఎన్నెన్నో సిద్ధంగా ఉంచాం. ఎవరూ దేనికోసం ఎక్కడికి వెళ్ళొద్దు. ఇది మూడు రోజుల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్, మీకేలోటు రాకుండా చూసుకొంటాం. విజయవంతంగా ట్రైనింగ్ ముగించుకొని వెళదాం! ఎందుకంటే మనపై గురుతరమైన బాధ్యత ఒకటి ఉంది. అదేమిటంటే ఒక విలువైన సమాచారాన్ని దేశమంతటా చేరవేసే వాహకాలం మనం. అదొక్క విషయం మనం ఎల్లపుడూ గుర్తుంచుకొంటే చాలు! సగం కార్యక్రమం విజయవంతమైనట్టే- సెలవిక భోజనానికి వెళదాం" ముగించి లేచాడు వక్త భుజంగం!

అంతా అతడివెంటే పోలోమని లేచారు. కానీ అందరి మనసుల్లో ఏదో తెలియని- మాటలకందని అశాంతి- గుబులు.

మల్లయ్య లేచి పరిసరాలన్ని పరికించి చూశాడు.

'మీ కోసం' స్వచ్ఛంద సంస్థ. రెండు చేతులు పరస్పరం షేక్‌హాండ్ ఇచ్చుకొంటున్న ఎంబ్లమ్‌తో వేదిక మీద బ్యానర్ రెపరెపలాడుతోంది. మల్లయ్య మరీ నిరక్షరాస్యుడేం కాదు. పేరట్లా పాత చింతకాయ పచ్చడిలా ఉంటుందిగానీ- డిగ్రీ డిస్‌కంటిన్యూ చేసి వ్యవసాయంలోకి దిగినవాడు. మంచీ చెడూ తెల్సు- దేన్నైనా విన్నవెంటనే విశ్వసించడు. ఒకవేళ అదే నిజమని తెలిస్తే మాత్రం తనతోబాటు వంద మందిని ఆ ట్రాక్‌లోకి తెచ్చేదాకా నిద్రపోడు.

ఆ సంస్థకు అచ్చంగా అలాంటివారే కావాలి!

"ఏమన్నా- భోజనం చేద్దాం పద" పక్క ఊరి సురేష్ భుజం తట్టి అన్నాడు.

ఎందుకోగానీ మల్లయ్యకు కాసేపు ఏకాంతంగా ఉండాలనిపించింది.

"నే బాత్‌రూంకి వెళ్ళొస్తా..." అబద్ధమాడాడు.

"పద నేనూ వస్తాను...బాగా గుర్తు చేశావ్"జిడ్డులా తగులుకున్నాడు.

మల్లయ్య ఉసూరుమన్నాడు. "చీ- మనుషులెంత తెలివితక్కువగా ఉంటారు- ఎదుటివారి మనసులో ఏముందో ఓ పట్టాన కనుక్కోరు- ఇటువంటివారితో చచ్చే చావే-" బలవంతంగా సురేష్‌తో బాత్‌రూంకి నడిచాడు. అతి విలాసవంతమైన కాలేజీ భవన సముదాయమది.



'మీ కోసం' స్వచ్ఛంద సంస్థ. రెండు చేతులు పరస్పరం షేక్‌హాండ్ ఇచ్చుకొంటున్న ఎంబ్లమ్‌తో వేదిక మీద బ్యానర్ రెపరెపలాడుతోంది. మల్లయ్య మరీ నిరక్షరాస్యుడేం కాదు. పేరట్లా పాతచింతకాయ పచ్చడిలా ఉంటుందిగానీ- డిగ్రీ డిస్‌కంటిన్యూ చేసి వ్యవసాయంలోకి దిగినవాడు. మంచీ చెడూ తెల్సు- దేన్నైనా విన్నవెంటన్నే విశ్వసించడు.

ఊరుబయట దాదాపు పదెకరాల విస్తీర్ణంలో సువిశాలంగా నిర్మించారు. చుట్టూ చెట్లూ, చల్లటి గాలి- పరిసరాలన్ని అత్యంత శుభ్రంగా ఆహ్లాదంగా ఉన్నాయి. బాత్‌రూంకి వెళ్ళి వస్తోంటే నిర్వాహకుల్లో ఒకరు ఎదురొచ్చారు.

"వసతీ- ఏర్పాట్లు అన్నీ బాగున్నాయా సార్" చిరునవ్వుతో అడిగాడు.

"బ్రహ్మాండం" అసంకల్పితంగానే బదులిచ్చాడు మల్లయ్య.

"ఏదో సార్ ఉన్నంతలో బెటర్‌మెంట్ కోసం ప్రయత్నించడం మాకు మొదట్నుండీ అలవాటు. కాంప్రమైజ్ అవ్వడం అస్సలు నచ్చదు" తనని తాను పొగుడుకొన్నాడు.

"మీరు కాంప్రమైజ్ అయినా మీ కో-ఆర్డినేటర్ స్టెల్లా ఊరుకోదుగా- ఆమెటువంటి మనిషో నాకు తెల్సులే" తనకంతా తెలుసన్నట్టు అన్నాడు సురేష్.

"నిజమేనండీ" నాలిక్కరచుకొన్నాడు నిర్వాహకుడు.

"స్టెల్లా... ఎవరూ?" మల్లయ్య అమాయకంగా అడిగాడు.

"స్టెల్లా... ఎవరా? ఈ సంస్థ నిర్వాహకురాలు- అబ్బో చాలా స్ట్రిక్టు. పైగా అనుకున్నది సాధించేవరకు నిద్రపోని మొండిఘటం. ఎక్కడో కేరళ నుండొచ్చి ఇక్కడ ఆంధ్రాలో ఎన్.జి.వో. స్థాపించి దాన్ని జిల్లావ్యాప్తంగా కాదు కాదు- రాష్ట్రవ్యాప్తంగా ఒక నెంబర్ వన్ దశకు తీసుకెళ్ళగలిగిందంటే మాటలా- అంతెందుకూ-? ఆమె ఈ ఎన్.జి.వో. తరపున ఇప్పటికి పది దేశాలు చుట్టొచ్చింది. ఆవిడ గురించి చెప్పాలంటే అబ్బో- చాలా ఉందిలే" సురేష్ వివరించాడు.

మల్లయ్య ఔనన్నట్టు తలూపాడు స్వయంగా చూడలేదుగానీ- ఆమె గురించి విన్నాడు. నిజమే స్టెల్లా ఎక్కడో కేరళ నుండొచ్చి ఇక్కడి తెలుగువారితో మమేకమయిపోయింది. 'మీ కోసం' స్థాపించిన ఆరేళ్ళలోనే వివిధ రకాల ప్రజా ఉద్యమాలు తనదైన శైలిలో నడుపుతూ ప్రజల్లోకి చొచ్చుకుపోయింది. తరతరాలుగా ప్రజల్లో నాటుకుపోయిన బలమైన దురాచారాలు, మూఢనమ్మకాలూ, నిరక్షరాస్యత వంటి సామాజిక రుగ్మతలపై అవిశ్రాంతంగా పోరాడుతూ కళాజాతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తూ రాష్ట్రస్థాయిలో లెక్కకు మించి

పురస్కారాలు అందుకొంది.

భోజనాల దగ్గర అంతా గుంపులు గుంపులుగా చేరి ముచ్చటించుకొంటున్నారు.

"నిజంగా మనదేశపు గడ్డి, అంత ప్రమాదకరమ యిందా?"మల్లయ్య అడక్కుండా ఉండలేకపోయాడు.

"కాకపోతే... ఇంతటి ప్రోగ్రాం... రైతుల సమీకరణ... ఖర్చు ఎందుకు చేస్తారు?" నువ్వేం పిచ్చోడివా అన్నట్టు ఒకడు ఎదురు ప్రశ్నించాడు.

"నాకెందుకో నమ్మబుద్ధి కావడం లేదు"

"నమ్మలేకపోతే ఎందుకొచ్చావ్" వీడెక్కడి వెర్రి మేళం అన్నట్టుంది ప్రశ్న.

"అదేంమాట... వచ్చినంత మాత్రాన ఏది చెబితే అది నమ్మేయాలా-?" గట్టిగానే ప్రశ్నించాడు మల్లయ్య.

సదరు శాస్త్రీ తడబడ్డాడు!

"ఏదైనా మొదటిసారి చెప్పినపుడు నిజమైనా- దాన్ని నమ్మం. నాల్రోజులు పోతే విషయం విని వినీ మెదడు దానంతట అదే చెప్పేదాంట్లోంచి సారాంశం గ్రహిస్తుంది. దానికితోడు ఒకటి రెండు ఉదాహరణలు ఏవయినా తటస్థ పడితే ఇక అప్పుడు కొత్తగా చెప్పనవసరం లేకుండానే దాన్ని నమ్మేదశకు ఆటోమేటిగ్గా మనమే చేరుకొంటాం" మూడో వ్యక్తి విశదీకరించాడు.

"ఎయిడ్స్ గురించి చెప్పినట్టు" ఎవరో జోక్ చేశారు.

"ఎగ్జాక్ట్లీ-" తన వాదనకి అయాచితంగా మద్దతు లభించేసరికి మొట్ట మొదటి శాస్త్రీ ఛాతీ అరంగుళం విచ్చుకొంది.

ఇంతలో ఏదో కోలాహలం! 'మీ కోసం' కో-ఆర్డినేటర్ స్టెల్లా వచ్చారన్న సన్నని వార్త ఆమె ఒంటికి పూసుకొన్న పరిమళంలా అందరిని చుట్టేసింది. అంతా ఆశ్చర్యపోయి చూస్తున్నారావిడని... ముప్పయేళ్ళ ప్రౌఢ, సహజసిద్ధమైన అందంతో ఎర్రతేలులా ధగధగలాడిపోతోంది. మెడలో పావుకిలోకి తక్కువ కాని బంగారం రకరకాల నగలుగా మెలికలు తిరిగిపోయింది. ఇహ కట్టుకొన్న చీర ఎట్లా చూసినా పదివేలకు దిగదు.

ప్రతిఒక్కరిని కేరళ యాసతో పేరుపేరునా పలకరిస్తూ, ఏర్పాట్లపై ఆరా తీస్తూ పావుగంటపాటు హాలంతా హడావిడిగా తిరిగింది.

శిక్షణకొచ్చిన వారిలో ఇంకా కుర్రతనం ఛాయలు పోని కొందరు "ఈ వయసులోనే చూసే కళ్ళకు ఇంత కిర్రెక్కిస్తోంది. ఇక ఆ వయసులో ఎలా ఉండేదో" అంటూ లోలోన పెదాలు కొరుక్కున్నారు.

"సారీ! ఈ సాయంత్రం నాకు గవర్నర్‌తో హైద్రాబాద్‌లో మీటింగ్ ఉంది. కాబట్టి మీతో గడపలేకపోతున్నాను- ఏమీ అనుకోవద్దు సెలవ్" అంటూ అందరికి చేతులూపుతూ హంసరెక్కల్లాంటి బుల్లి కారెక్కి క్షణాల్లో మాయమయింది. అక్కడున్న వారంతా ఏదో టెన్షన్ నుండి రిలీజయినట్టు స్వేచ్ఛగా శ్వాస వదిలారు.

***

ఆఖరు రోజు సమావేశం!

"సో... మిత్రులారా-? ఏతావాతా చెప్పొచ్చేదేమిటంటే ప్రపంచంలో ఉన్న యాభయి రకాల గడ్డిజాతులకన్నా మనదేశం గడ్డి అత్యంత ప్రమాదకారి. ఇదెంత ప్రమాదకారి అంటే- గుప్పెడు గడ్డి- ఒక చెంచా విషానికి సమానం. ఇది ఇట్లా మారడానికి తగు కారణం కూడా ఉంది. అదేమిటంటే... మన దేశానికి ఉత్తరాన హిమాలయాలున్నాయన్న సంగతి మనందరికీ తెలిసిందే... వాటినుండి ఏడాదిలో దాదాపు ఆరునెలలు వీచే తీవ్రమయిన చలిగాలులు కోట్లాది సంవత్సరాలుగా తట్టుకొని తట్టుకొనీ గిడసబారి ఇంత డేంజరస్‌గా తయారయిందన్నమాట- ఇదంతా ఓరల్‌గా చెబితే అంత నమ్మదగ్గదిగా తోచదు కాబట్టి ఇందుకు సంబంధించిన బ్రోచర్లు అచ్చేసి ఊరూరా పంచబోతున్నాం. ఇంకా ఇదే అంశంతో నాటికలు, కళాజాతాలు చాలా చాలా ప్రోగ్రామ్స్ ఉన్నాయి. అందుకు నిధులు కూడా దండిగానే ఉన్నాయ్... కావాల్సిందల్లా మానవ వనరులు-సమయం కేటాయించగలిగే మీలాంటి అమూల్యమైన వ్యక్తులు..."

"మరి ఉన్న గడ్డి నాశనం చేసుకొంటే పశువులకి గడ్డెట్లా సార్"

అయిదారు నిమిషాలు అక్కడ అలవికాని నిశ్శబ్దం ఆవరించింది. అరగంటలో ప్రతి శిక్షకుడికి వేయి రూపాయల రెమ్యూనరేషన్- ఓ మాంఛి బ్యాగు- నోట్‌బుక్ పెన్ను- సర్టిఫికెట్ అందజేయబడ్డాయి. ఆ డబ్బూ- వస్తువులూ తీసుకొంటుంటే మల్లయ్య చేతులు ఎందుకో గజగజా వణికేయి...!



ఆఖరుగా మల్లయ్య ధైర్యం చేసి ప్రశ్నించాడు.

"గుడ్ కొచ్చన్... అందుకే దేశంలో గడ్డికొరత నివారించడానికి...పనిలో పనిగా స్వచ్ఛమయిన పోషకాలూ మన వాతావరణానికి అనుకూలంగా పెరిగే కొత్త గడ్డికోసం కొత్త విత్తనాలు సరఫరా చేసి విరివిగా పంచాలని మాలాంటి స్వచ్ఛంద సంస్థలని ప్రభుత్వం కోరింది. అవసరమైతే లక్ష టన్నుల గడ్డివిత్తనాలయినా ఉచితంగా సరఫరా చేస్తాం- అది మా బాధ్యత"

"ఇంత ఖర్చు- ఇంతటి నెట్‌వర్క్ ఎట్లా సాధ్యం- డబ్బెక్కడనుండొస్తుంది?"

"ఇదీ గుడ్ కొచ్చెనే... ఇందుకు మనకొక విదేశీ బాంకు ముందుకొచ్చింది"

"విదేశీ బ్యాంకా-?"

"యస్... కోట్లాది డాలర్లు ఇందుకోసం ఉదారంగా- ఉచితంగా అందిస్తోంది. మొదటి సంవత్సరం ప్రతి జిల్లాలో వేయి ఎకరాల చొప్పున దేశంలో వంద జిల్లాల్లో ప్రారంభించి మొత్తం దేశంలో వచ్చే పదేళ్ళలో ప్రస్తుతం ఉన్న గడ్డినంతటిని రూపుమాపి కొత్తగడ్డిని సాగు చేయాలనే కృతనిశ్చయంతో ఉంది. ఈ మహాయజ్ఞం విజయవంతం కావాలంటే మీరూ- మీలాంటి వేలాది మంది రైతుల తోడ్పాటు ఎంతో అవసరం..."

అంటూ క్షణం ఆగి "ఇంతేనా- ఇంకా ఏమైనా అనుమానాలున్నాయా ఉంటే నిశ్చింతగా అడగండి... ఎందుకంటే ఈ సమావేశం ఇంతటితో ముగియబోతోంది" అంటూ కూచున్నాడు.

అయిదారు నిమిషాలు అక్కడ అలవికాని నిశ్శబ్దం ఆవరించింది. అరగంటలో ప్రతి శిక్షకుడికి వేయి రూపాయల రెమ్యూనరేషన్- ఓ మాంఛి బ్యాగు- నోట్‌బుక్ పెన్ను- సర్టిఫికెట్ అందజేయబడ్డాయి.

ఆ డబ్బూ- వస్తువులూ తీసుకొంటుంటే మల్లయ్య చేతులు ఎందుకో గజగజా వణికేయి...!

అయిదేళ్ళ క్రితం తల్లి పోయినపుడు శవం మీది నగలూ- వస్తువులూ తీస్తున్నపుడు అచ్చం అట్లాగే వణికినట్టు గురుతు-!

***

ఏడాది గడిచింది! విదేశీబ్యాంకు... ప్రదేశం స్వదేశమే!!

"గడ్డి ఎపిసోడ్ విజయవంతమైనట్టేనా-?" ఇంగ్లీషులో అడిగాడు బ్యాంకు వైస్ ప్రెసిడెంట్.

"ఎక్స్‌లెంట్- మొదటి ఏడాది లక్ష ఎకరాల్లో మన గడ్డి విత్తనాలు అందించాం వందకోట్ల లాభం-" ఇంగ్లీషులోనే నవ్వింది మరో అడ్మినిస్ట్రేటివ్ తలకాయ.

"విత్తనాలు ఉచితంగానే ఇచ్చాంగా- వందకోట్లు ఎట్లా వచ్చాయి"

"ఉచితమంటే ఏమిటో ఇక్కడి ప్రజలకు బాగా తెలుసు- అందుకే నిర్వహణా ఖర్చులనీ కిలోకి రెండ్రుపాయలు వసూలు చేశాం- కిమ్మనకుండా డబ్బు చెల్లించి మరీ తీసుకెళ్ళారు-"

"నిజానికి ఆ రేటు బీడీ కట్టకన్నా తక్కువ కదా..."

"యస్... నూటికి నూరుపాళ్ళు అంతే..."

"నెక్స్ట్ ఇయర్ ప్లాన్స్ ఏమిటి?" వైస్ వాయిస్ ప్రశ్నించింది.

"మరో ఇరవై లక్షల ఎకరాల్లో కొత్తగడ్డి సాగు చేయడం...ఇంకా మిగిలిన గడ్డిని సామూహికంగా దహనంచేయడం" విశదీకరించింది రెండోతలకాయ.

"అంతేనా-"

"అంతేకాదు గడ్డివిత్తనాల ధర నాలుగింతలు పెంచడం"

"కొంటారా-?" విషపునవ్వు అడిగింది.

"చచ్చినట్టు కొంటారు- ప్రజలు ఒకసారి దేనికైనా అలవాటయితే చాలూ- ఇహ ఓ పట్టానా దాన్ని వొదలరు-" విషపునవ్వే బదులిచ్చింది.

"కాఫీ... టీల్లాగా" - "యస్ అంతే..."

ఇంతలో బయట ఏదో కలకలం విన్పించింది! రైతు సమూహం- కదలివస్తుంది.

"మా గడ్డి మేం రక్షించుకొంటాం- విదేశీబ్యాంకు గో బ్యాక్..."